# చెట్లని కలిపిన కాయలు

**'రిచర్డ్‌సన్'లోని ఇండియన్ స్టోర్స్‌లో అమెరికాలో స్థిరపడిన యువకునికి, అమెరికాలో స్థిరపడిన అమ్మాయి పెళ్లి చేసుకునేందుకు కావాలంటూ ఇచ్చిన ప్రకటనకి, 'ఫరవాలేదు పది ఉత్తరాలు వచ్చినాయి' అనుకున్న వెంకట్రాముడు ఒక్కొక్క ఉత్తరమే చించి చదివాడు.**

**'ఈ ఉత్తరంలోని వివరాలు బాగున్నాయి' అనుకుని, మళ్లీ వివరాలు చదివాడు వెంకట్రాముడు.**

**పేరు** వాణి. న్యూయార్క్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఓక్లహామాలో ఉపాధ్యాయినిగా ఉద్యోగం చేస్తున్న తల్లి ఉత్తరం రాసింది. ఫోను నెంబరు ఇచ్చింది.

ఆమె ఇచ్చిన నంబరుకి డైల్ చేసి ఫోను చెవిదగ్గర పెట్టుకున్నాడు. "హలో!" అన్న సన్నని కంఠం వినపడ్డంతోటే, "హలో...!" అని తనని తాను పరిచయం చేసుకుని వెంకట్రాముడు, "మీ అమ్మాయి గురించి రాసిన వివరాలన్నీ నాకు నచ్చాయి!" అన్న ఆయన, తన కుమారుడు వరుణ్ వివరాలన్నీ చెప్పాడు.

ఆమె తను విమలా చంద్రశేఖర్‌ని అని తన పరిచయం అయ్యాక, కూతురు వాణి వివరాలన్నీ చెప్పాక, వెంకట్రాముడు "మరి మీ భర్త చంద్రశేఖర్‌గారు ..."

"ఆయన ఇప్పుడు నాతో లేరు, నేను డైవోర్సీని..." అని చెప్పింది వెంకట్రాముని పూర్తిగా చెప్పనీయకుండానే.

"ఓ... ఐ యామ్ సారీ... " 'భర్త లేకుండా ఒంటరి స్త్రీ కూతురిని పెంచడానికి ఎంత కష్టపడిందో ...' అనుకుని పరితాపపడ్డాడు ఆయన.

"డైవోర్సీ కూతుర్ని మీ అబ్బాయికి చేసుకునేందుకు మీకేమైనా అభ్యంతరమా?"అడిగింది విమల.

"అబ్బెబ్బే.... అదేం లేదండీ!"

"మరైతే ఈ సన్‌డే మా అమ్మాయి ఫొటో తీసుకుని మీ ఇంటికి వస్తాను. ఇక్కడ నుంచి డల్లాస్ త్రీ అవర్స్ డ్రైవ్!"

"నో... నో.... మీరు ఇబ్బంది పడద్దు. నేనే మా వరుణ్ ఫొటోతో మీ ఇంటికొస్తాను ఈ సన్ డే!" అని ఫోనులో చెప్పినట్లు ఆ ఆదివారం వెంకట్రాముడు ఓక్లహామా, విమలగారింటికి వచ్చాడు.

"నమస్తే, రండి!" అని వెంకట్రామునికి స్వాగతం పలికిన విమలకి ఏభై ఏళ్లుంటాయి. జుట్టులోని సగభాగం నెరిసిపోయింది ఆమె పెద్దరికానికి చిహ్నంగా. జుట్టుని దువ్వి రబ్బర్ బాండ్‌తో బంధించింది. సాదా సీదా గుంటూరు నేత చీరలో అసలు సిసలైన తెలుగింటి ఆడపడుచులా కనిపించింది వెంకట్రాముని కళ్లకి.

"పెళ్లి మాటలు మాట్లాడేందుకు వచ్చేటప్పుడు ఉత్త చేతులతో వెళ్లకూడదంటారు పెద్దలు" అన్న వెంకట్రాముడు బాగ్‌లోంచి అరటిపండ్లు, యాపిల్, ద్రాక్షపళ్లు తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"థాంక్స్!" అని పళ్లు తీసుకుంది విమల.

"వరుణ్ తల్లిని కూడా తీసుకొస్తారనుకున్నానే..." అని అడిగినామెకు,

**ఎ. సువర్ణ**

"ఫోనులో చెప్పనేలేదు కదూ? వరుణ్ మదర్ చనిపోయి రెండు సంవత్సరాలైంది!" అని చెప్పాడు వెంకట్రాముడు.

"ఓ... ఐ యామ్ సారీ!" అని నొచ్చుకుందామె.

"ఇదుగో, మా అబ్బాయి వరుణ్ ఫొటో. హీ ఈజ్ వెరీ బ్రిలియంట్! చికాగోలో ఓ పెద్ద కంపెనీలో టాప్‌లో - పెద్ద ఆఫీసరుగా ఉద్యోగం చేస్తున్నాడు!" అని చెప్పి ఫొటో ఇచ్చాడు.

"ఓ....! హేండ్‌సమ్!" అని మెచ్చుకుంది వరుణ్ ఫొటో చూసి.

"ఇదిగో, మా వాణి ఫొటో. హైలీ క్వాలిఫైడ్ ఎం.బి.ఏ. చేసి మానేజింగ్ కన్సల్టెంట్‌గా జాబ్ చేస్తోంది శాన్‌ఫ్రాన్సిస్కోలో ఓ కంపెనీలో..." అన్న విమల కూతురి ఫొటో వెంకట్రాముడికి ఇచ్చింది.

ఇద్దరి ఫొటోలూ పక్కపక్కనే పెట్టి, ఎక్సలెంట్ ఫెయిర్! ఈడూ జోడూ బాగున్నారు. తొందరగా ఇద్దరికీ పెళ్లి చేసేద్దాము! మాకే కట్నకానుకల ఆశ లేదు!" అన్న ఆయన మాటలు విమల కెంతో సంతోషాన్ని కలుగజేసినాయి.

"మీలాంటి పెద్దలు మా ఇంటికి రావడమే ఎంతో గొప్ప విషయం!" అని ఆమె ఆనందాన్ని ఆయనకి తెలియచెప్పింది.

ఆ తరువాత వారిద్దరూ చాలాసేపు భారతదేశంలోని రాజకీయాల గురించి మాట్లాడుకున్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం స్థిరంగా ఉండకపోవడం వారిద్దరికీ బాధ కలిగించింది.

ఇద్దరూ కలిసి పెసరట్లు - ఉప్మా తిని, కాఫీ తాగారు.

"మన పిల్లలిద్దరికీ ఫోను నెంబర్లిచ్చాము కనక కొన్నాళ్లు కలిసి మెలిసి తిరిగి ఒకరినొకరు అర్థం చేసుకున్నాకే పెళ్లి విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటారనుకుంటాను!"

"ఎస్, దట్ ఈజ్ ద బెస్ట్!" అని ఆయన అభిప్రాయంతో ఏకీభవించింది విమల.

ఆ తరువాత తరచు వెంకట్రాముడు, విమల ఫోనులో మాట్లాడుకోవడాలూ, కలుసుకోవడాలూ చేశారు.

"వెంకట్రాముడు గారూ! వాణికి ఆరేళ్ల వయసప్పుడు మావారు ఇంజనీరుగా పనిచెయ్యడానికి అమెరికా వచ్చారు. ఆయన వచ్చిన ఆరు నెలలకి వాణిని తీసుకుని నేను అమెరికాకి వచ్చాను.

"ఓ ప్రాజెక్టు వర్క్‌కోసం గల్ఫ్ దేశాలకి వెళ్లినాయన, కూడా తీసుకెళ్లిన సెక్రటరీని పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడ్డాడు. నాకు ఉద్యోగం ఉంది కనుక ఇబ్బంది లేకపోయింది. పది సంవత్సరాలు ఓపికగా ఎదురు చూసి ఇంక రారని నిర్ధారించుకుని ఆయననుంచి డైవోర్సు తీసుకున్నాను!" అని చెప్పింది ఓ సారి వెంకట్రాముని ఇంటికి వెళ్లినప్పుడు



విమల.

ఓ బుధవారం విమల వెంకట్రామునికి ఫోను చేసినప్పుడు "మా వాణి ఫోన్ చేసింది. మీ వరుణ్‌తో ఫోనులో మాట్లాడిందట. ఈ వారం ఇద్దరూ కలుసుకుని మనసులు విప్పి మాట్లాడుకుంటామని చెప్పింది!" అని చెప్పింది.

"దట్స్ గుడ్! నేను మా వరుణ్‌ని అడిగాను, వాడు అదే సమాధానం చెప్పాడు!"

"ఆఫీసు అవర్స్ పోను, మీ దినచర్య ఏమిటండీ?" అని అడిగింది విమల.

"ఒంటరిగాణ్ణే ... ఎక్కువసేపు ఆఫీసులోనే గడుపుతాను. పొద్దున లేవగానే కాసేపు వాకింగ్‌కి వెడతాను. వచ్చాక స్నానం చేసి, వంట చేసి బాక్సులో పెట్టుకుంటాను. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా బి.పి. ఎక్కువైపోయింది!"

"బాగా ఉప్పు తగ్గించి తినండి!" సలహా ఇచ్చింది విమల.

"అసలే చప్పిడి జీవితం... భోజనం కూడా చప్పిడి అయితే ఎట్లా భరించడం?" అన్నాడు తమాషాగా.

"భలే జోకు వేశారులెండి. మనిద్దరి చప్పిడి జీవితాలు జోరు జీవితాలుగా మారబోతున్నాయి. మన పిల్లలు పెళ్లి పనులు చెయ్యడానికి ఉరుకులు పరుగులు తియ్యాలిగా?"

వెంకట్రాముడు కొడుకు పుట్టినరోజున ఇర్వింగ్‌లోని హిందూ దేవాలయానికి కొడుకు పేరున అర్చన చేయించడానికెళ్లిన రోజునే విమల కూతురు పుట్టినరోజు అర్చన చేయించడానికని అదే దేవాలయానికి వచ్చింది.

"వాట్ ఏ కో ఎక్సిస్టెన్స్!" అనుకుని ఆశ్చర్యపోయారిద్దరూ ఒకరి నొకరు చూసుకుని.

వెళ్లబోతూ విమల ఆయనతో ఏదో చెప్పాలని చెప్పలేకపోతోంది.

అది గమనించిన వెంకట్రాముడు, "ఏమిటండీ విమలగారూ, ఏదో చెప్పాలనుకుంటున్నారల్లే ఉందే!" అని అడిగాడు.

"నేను పదిహేను రోజులు ఇంట్లో ఉండను!" అన్నది విమల.

"ఎక్కడికైనా టూర్ వెడుతున్నారా?"

"అహా... టూర్‌కి వెళ్లడంలేదు. నర్సింగ్ హోమ్‌కి వెడతాను!"

ఆమె మాటలకి వెంకట్రాముడు కంగారుపడుతూ, "నర్సింగ్ హోమ్‌కా? ఎందుకు? ఏమిటి నలత?"

"నా వయస్సులో ఉండే ఆడవాళ్లందరికీ వచ్చే నలతే! మామూలు నలతే... డాక్టర్లు ఆపరేషన్ చెయ్యాలన్నారు! ఆపరేషన్ ముందు నాలుగు రోజుల ముందుగా చేరాలన్నారు!"

"అయ్యో, మామూలు నలతంటారేమిటండీ? హిస్ట్రెక్టమీ.... అంత తేలికైనదంటారేమిటండీ! ఇంట్లో మీకు తోడు ఎవరైనా ఉన్నారా?"

"నా కొలీగ్స్ అందరూ నాకు తోడే!"

"ఎప్పుడు ఎడ్మిట్ అవుతున్నారు?"

"సోమవారం పొద్దుటే!"

"సోమవారం వరకూ వెంకట్రాముడు విమలకి ఫోను చేస్తూనే ఉన్నాడు. సోమవారం పొద్దునే వెంకట్రాముడు డల్లాస్ నుంచి ఒకలహోమా విమల ఇంటికి వచ్చాడు.

"కాబోవు వియ్యపురాలు ఎవరు తోడూ లేకుండా ఆసుపత్రికి ఒంటరిగా వెళ్లి అడ్మిట్ అవడం ఏమిటని నేను వచ్చేశాను!" అని ఆయన విమలను తీసుకెళ్లి ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడు.

బుధవారం ఆపరేషన్ అయి, స్పృహ వచ్చీ రాని విమలను, ఆపరేషన్ థియేటర్ నుంచి వార్డుకి తీసుకొస్తున్న విమలను చూస్తూ, "ఆర్ యూ ఫైన్?" అని ఆదుర్దాగా అడిగాడు వెంకట్రాముడు.

విమల ఆసుపత్రిలో ఉన్న పది రోజులూ వెంకట్రాముడే ఆమెకి కావాల్సిన ఆహారం తనే చేసి తీసుకొచ్చాడు. పొద్దున, సాయంత్రం ఆమె దగ్గర కూర్చుని కాసేపు కబుర్లు చెప్పాడు.

"ఇంత మంచివారు నాకు వియ్యంకుడు కాబోతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది!" అన్న విమల కంట ఆనందభాష్పాలు వచ్చేసినాయి.

డిస్‌ఛార్జ్ అయి ఇంటికి వెళ్లాక కూడా రోజుకోసారైనా విమల వాళ్లింటికెళ్లి ఆమెను చూసి ఆమెతో కాసేపు కబుర్లు చెప్పి వచ్చేవాడు వెంకట్రాముడు.

ఓ రోజు ఫోనులో వాణి తల్లికి ... "మమ్మీ! ఈ వీకెండ్‌కి నేను, వరుణ్ ఆరిజోనా వెళ్లి గ్రేట్ కెనియాన్ చూసి వద్దామనుకుంటున్నాము. అక్కడే మా పెళ్లి గురించిన నిర్ణయం తీసుకుందామనుకుంటున్నాము. వెయిట్ ఫర్ ద గుడ్ న్యూస్!" అని చెప్పి నవ్వి, ఫోను పెట్టేసింది.

నెల తర్వాత ఓ ఆదివారం వెంకట్రాముడు విమల ఇంటికి వచ్చాడు.

బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నాక వెంకట్రాముడు "రోజులు గడిచిపోతున్నాయేకానీ, మన పిల్లలు ఇంతవరకూ వాళ్ల నిర్ణయాన్నే తెలుపలేదు మనకి!" అన్నాడు.

"మనమే ఫోన్ చేసి తెలుసుకుందాము!" అన్నది విమల.

"హల్లో, వరుణ్!" అని కొడుకుని ఫోనులో పిలిచాడు వెంకట్రాముడు.

"ఓ.... డాడీ! నేనే మీకు ఫోన్ చెయ్యాలనుకుంటూండగా మీరే చేశారు, థాంక్స్!"

"ఒకలహోమా వెళ్లి వచ్చి నెల దాటిపోయింది ...."

"ఆఁ, అవును. మిస్ వాణి కూడా ఇప్పుడిక్కడే ఉన్నారు, డాడీ!"

"నేను వాళ్ల అమ్మగారింటి నుంచే ఫోన్ చేస్తున్నాను..." అన్న వెంకట్రాముడు విమల వైపు తిరిగి, "మీ డాటర్ మా సన్ ఇంట్లోనే ఉన్నదట, మాట్లాడండి!" అని ఫోను విమల చేతికిచ్చాడు వెంకట్రాముడు.

"వాణీ!"

"ఆఁ, చెప్పు మమ్మీ!"

"పెళ్లి మన సంప్రదాయంగా మన దేశంలో జరిపిద్దామా, వాణీ!" అని అడిగింది విమల వాళ్లిద్దరూ పాజిటివ్ నిర్ణయానికి వచ్చారని.

"ఓ.... మమ్మీ! అంత తొందరపడకమ్మా? నేను, వరుణ్ నెల రోజులనుంచీ పరిచయం పెంచుకుని, మనసులు విప్పి మాట్లాడుకుని ఒకరినొకరిని బాగా అర్థం చేసుకున్నాక...." అని తరువాతది చెప్పకుండా ఆగింది వాణి.

తల్లి ఆదుర్దాగా ..."ఆఁ, అర్థం చేసుకున్నాక?" అని అడిగిన తల్లికి, "మేము స్నేహితులుగా మాత్రమే ఉండగలం. భార్యాభర్తలుగా ఉండే అర్హత మాలో లేదు!" అన్న కూతురు మాటలు విన్న తల్లి, "అంటే మీరు పెళ్లి చేసుకోరన్న మాట!" అన్న విమలమాటలు వింటూన్న వెంకట్రాముడు, దిగులుగా "ఏమిటండీ విమలగారూ? మన పిల్లలు పెళ్లి చేసుకోరుటా?" అని అడిగాడు.

రిసీవరు పెట్టేసి "ఆ.... పెళ్లి చేసుకోరుట. ఎవరి దారులు వాళ్లవేనట!" అన్న విమల మాటలు విన్న వెంకట్రాముడు దిగులుగా కళ్లు తేలేశాడు.

గాబరాగా ఆయన దగ్గరగా వెళ్లి మొట్టమొదటిసారిగా ఆయన చెయ్యి పట్టుకుని, "సార్.... సార్! ఏమిటండీ ఇట్లా అయిపోయారూ?" అన్న విమల కళ్లల్లోకి చూసిన ఆయన చూపులలో తమ పిల్లల వల్ల ఏర్పడిన ఈ ఆత్మీయత, స్నేహం, ఆదరణ, జాలి, కరుణ అన్నీ వ్యర్థమేనా.... అని అడుగుతున్నట్లుగా ఉన్నాయి.

"కావు... కావు...! వాళ్లిద్దరినీ మన ఇద్దరికీ బిడ్డలుగా చేసుకుందాము ...!" అన్న వెంకట్రాముడి మాటలకి తన అంగీకారం తెలుపుతున్నట్లుగా ఆయన చెయ్యి గట్టిగా పట్టుకుంది విమల. ■

